క్లుప్తంగా

ఉత్సవ కమిటీలతో సమావేశం

భద్రాచలంఅర్బన్: ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో శనివారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని పలు సలహాలు, సూచనలు చేశారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాస్, పట్టణ ఎస్సైలు మధు ప్రసాద్, పీవీఎస్ రావు, విజయలక్ష్మిలతో పాటు భద్రాచలం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో 5 సంవత్సరాలుగా సేవలందించి బదిలీపై వెళ్తున్న పోలీస్ సిబ్బందిని సన్మానించారు. ఏఎస్సై అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌లు గత ఐదు సంవత్సరాలుగా భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో పనిచేసి బూర్గంపాడు, భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. వీరి స్థానంలో బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ నుంచి నర్సింహారావు, టేకులపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి సూర్యలు ఏఎస్సైగా రిపోర్టు చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సైలు మధు ప్రసాద్, పీవీఎస్ రావు, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీసాహితిని కలిసిన పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మోరంపల్లిబంజర ఆస్పత్రికి వచ్చే వందలాది మంది రోగులను దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. పార్టీ నాయకులు జక్కుల రాంబాబు, వీరమల్ల ఉమ, బర్ల రామకృష్ణ, సత్యనారాయణ,వైఎస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సాంబశివారెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన యువరైతు సిద్ది శివ ఇటీవల మృతి చెందగా శనివారం దశ దిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, నాయకులు తోట శ్రీనివాసరావు, కోలా నాగేశ్వరరావు, పడాల నాగరాజు, మండెపూడి నాగరాజు, కోలా భాస్కర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన గోకినపల్లి కృష్ణ క్వింటా బియ్యాన్ని మృతుడి కుటుంబానికి వితరణగా అందజేశారు. బశివారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన కిన్నెర చెన్నారావు అనే వ్యక్తి కొద్ది రోజుల క్రితం మామిడి కాయలు కోసే క్రమంలో చెట్టుపై అదుపుతప్పి కింద పడటంతో నడుము విరిగింది. దాంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. కాగా కుటుంబీకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా.. స్థానిక చిట్టితల్లి సేవా సమితి బాధ్యులు, నారంవారిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ మనుగొండ వెంకటముత్యం బాధితుడిని శనివారం పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో కుందవరపు శ్రీనివాసరావు, సురేష్, సుజిత్ రాజ్, రజని రమేష్, వేముల రమేష్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో ఉపాధి కల్పిస్తామని చెప్పుతూ ఆదివాసీలకు కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమ దోపిడీ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఐటీడీఏ ఆవరణంలో శనివారం మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తవరపు జానకిరామ్ అధ్యక్షన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి కొరకు వివిధ రాష్ట్రాల నుంచి వలస వస్తున్న ఆదివాసీలను కొందరు లేబర్ సప్లయ్ పేరుతో ఏజెంట్లు మాఫియా కొనసాగిస్తున్నారని అన్నారు. సంబంధిత అధికారులు అలాంటి ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పర్షిక సోమరాజు, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

టీడీపీ నిరసన

మణుగూరురూరల్: మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్ట్‌పై ఆ పార్టీ నాయకులు శనివారం నిరసన తెలిపారు. మణుగూరులో జరిగిన నిరసనలో నాయకులు దొడ్డికృష్ణ, కూచిపూడి బాబు, ఎం.శ్రీనివాసరావు, రఘురాం, మధుసూదన్, సర్పంచ్ బచ్చలభారతి, పసునూరి సీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. ఆధ్యాత్మికం!

- మినీ 'పేట'గా వినాయకపురం
- కుగ్రామం నుంచి పంచాయతీగా ఎదుగుదల
- ఆర్థిక వృద్ధితో ఉపాధికి ఊతం
- పురాతన, ప్రముఖ ఆలయాలతో పర్యాటక శోభ


వినాయకపురం ఏరియల్ వ్యూ..


అరుదైన శివాలయం ఇదే..

సండే స్పెషల్

అశ్వారావుపేటరూరల్: ఏజెన్సీ ప్రాంతంలో మూప్పై ఏళ్ల క్రితం నాటి ఓ చిన్నపాటి పల్లె నేడు ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. పల్లె స్థాయి నుంచి నేడు గ్రామ పంచాయతీ హోదాతో వ్యాపార, ఉపాధికి అడ్డాగా మారుతోంది. మినీ అశ్వారావుపేటగా విరజిల్లుతూ.. తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఆ పల్లె ప్రస్థానంపై 'సండే స్పెషల్'..

నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటకు 14 కిలోమీటర్ల దూరం (భద్రాచలం వెళ్లే ప్రధాన మార్గం)లో ప్రధాన రహదారికి అనుకుని వినాయకపురం అనే గ్రామం ఉంది. దాదాపు మూప్పై ఏళ్ల క్రితం ఓ కుగ్రామంగా మొదలైన ఈ గ్రామం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత 2019లో గ్రామ పంచాయతీ హోదా దక్కించుకుంది. నేడు ఆధ్యాత్మిక, పర్యటకంగా, అభివృద్ధి, వ్యాపార, ఉపాధి రంగాలకు నిలయంగా మారింది. గ్రామస్థాయిలోనే అభివృద్ధి వైపు అడుగులు పడుతున్న క్రమంలోనే గ్రామ పంచాయతీ హోదా తర్వాత మరింత వేగం పుంజుకుంది.

అన్ని రంగాల్లో ముందుకు..

వినాయకపురంలో గతంలో సరిగ్గా కిరాణా, ఇతర వ్యాపార సముదాయాలు కూడా లేవు. ప్రస్తుతం పెద్ద సంఖ్యలో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. చిన్నపాటి పూరి పాకలు, రేకుల షెడ్డుల్లో ఉండే దుకాణాలు నేడు శాశ్వత భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లుగా విస్తరించాయి. కొంతకాలం క్రితం స్థానికులకు ఏ చిన్న పాటి వస్తువు కావాలన్నా.. దూరంగా ఉన్న అశ్వారావుపేట మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు ఈ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారిపోయింది. అశ్వారావుపేటలో దొరికే అనేక రకాల వస్తువులు, సౌకర్యాలు ప్రస్తుతం వినాయకపురంలోనే లభ్యమయ్యేలా స్థానికంగా వ్యాపార అభివృద్ధికి బాటలు పడ్డాయి. స్థానికంగా రెండు ప్రముఖ కంపెనీల పెట్రోల్ బంకులతోపాటు, ఓ గ్రామీణ వికాస బ్యాంకు, యూనియన్ బ్యాంకు, మీ సేవా కేంద్రాలు, ప్లేయాష్ బ్రిక్స్ తయారీ పరిశ్రమలు, ప్రైవేటు పాఠశాల, టిఫిన్ సెంటర్లు, పలావ్, భోజన హోటళ్లు, రెస్టారెంట్, దాబాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరి, టీ పాయింట్స్ ఇలా చెప్పుకుంటే అశ్వారావుపేటలో ఉన్న ప్రతి వ్యాపార సముదాయం స్థానికంగా అందుబాటులోకి వచ్చేశాయి. వీటితోపాటు ఆరుకుపైగా జామాయిల్ డిపోలు ఉన్నాయి. వీటిని బెంగుళూరు చెందిన వ్యాపారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా ఈ డిపోలతో మూడు వేబ్రిడ్జి కేంద్రాలు ఏర్పాటు కాగా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 8 వందల మంది రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి అందుతుంది.

ప్రముఖ క్షేత్రంగా 'చిలకలగండి'

వినాయకపురం వ్యాపారం, ఉపాధి రంగాలతోపాటు ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిలయంగా మారింది. గ్రామ శివారులోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయానికి ఎన్నో దశాబ్దాల చరిత్ర ఉంది. అటవీ ప్రాంతంలో కొలువుదీరిన అమ్మవారు భక్తుల కోరికలను తీర్చుతుందని అనేకులు విశ్వసించడంతో లక్షల్లో భక్తులు వస్తున్నారు. ఆది, గురువారాల్లో అయితే భక్తుల రద్దీ మరింతగా ఉంటుంది. ప్రతి ఏటా ఉగాది పండుగ సమయంలో అమ్మవారి ఆలయం వద్ద ఐదు రోజులపాటు జాతర మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతోపాటు, ఏపీలోని ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తజనం తరలివస్తారు. ఈ ఆలయం వద్ద భక్తుల రద్దీ, లక్షల్లో వచ్చే ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని 2007వ సంవత్సరంలో శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని ఆ నాటి ప్రభుత్వం దేవదాయ శాఖకు అప్పగించింది.

అరుదైన శైవక్షేత్రం..

వినాయకపురం కాలనీ వద్ద స్థానికులైన భూక్యా భిక్షం దంపతుల ఆధ్వర్యంలో ఆరు ఎకరాల తమ సొంత వ్యవసాయం భూమిలో అరుదైన శైవక్షేత్ర ఆలయాన్ని నిర్మించారు. సుమారు రూ.కోటి రూపాయాలు వెచ్చించి 2014లో దీనిని ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా ఈ ఒక్క ఆలయంలో మాత్రమే 42 అడుగుల ఏకశిల ధ్వజస్తంభం, ఆలయం ఎదుట 28 అడుగుల పాదవు, 14 అడుగుల ఎత్తులో నంది విగ్రహంతోపాటు, 14 అడుగుల ఏకశిల శివలింగం ఏర్పాటు చేశారు. ఈ శివలింగానికి పైభాగంలో శ్రీ చక్రం సైతం ఉంటుంది. అలాగే ఆలయం లోపల నవగ్రహాల ఆలయం కూడా ఉంది. ఆలయం ఎదుట 100 అడుగుల కోనేరుతోపాటు, మృత్యుంజయుడు, ఏడు అడుగుల భగీరథ విగ్రహాలు ఉన్నాయి. దాంతో ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. వీటితోపాటు గ్రామంలో సాయిబాబా, రామాలయం, ఆంజనేయస్వామి, గోశాల ఉన్నాయి. ఇవే కాకుండా నూతనం గ్రామంలో రూ.60లక్షల వ్యయంతో మరో రామాలయాన్ని సైతం గ్రామస్తులు, భక్తుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు.

వ్యాపార కేంద్రంగా మారింది



ఒకప్పుడు ప్రతి వస్తువు కొనుగోలు చేసేందుకు దూరంగా ఉన్న అశ్వారావుపేటకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అన్ని వస్తువులూ స్థానికంగానే దొరుకుతున్నాయి. వ్యాపారపరంగా వేగంగా అభివృద్ధి జరుగుతోంది. రానున్న రోజుల్లో మరింత విస్తరించే అవకాశాలున్నాయి.

– ఉప్పల ప్రసాద్, వినాయకపురం

ఆధ్యాత్మిక క్షేత్రంగా విరజిల్లుతోంది



అన్ని రంగాల్లో అభివృద్ధితోపాటు, ఆధ్యాత్మిక క్షేత్రం విరజిల్లుతుంది. స్థానికంగా ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం కారణంగా ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. ఆలయానికి భక్తుల అధికంగా రావడంతో భక్తితోపాటు, పర్యటక ప్రాంతంగా పేరుగావిస్తోంది.

– బిక్రం రమాదేవి, ముత్యాలమ్మ ఆలయ చైర్మన్

గడప గడపకు కాంగ్రెస్ పాదయాత్ర


ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం

మణుగూరురూరల్: మణుగూరు మండల, మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పాదయాత్ర ముమ్మరంగా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని మామిడితోటగుంపు, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇంటింటికి తిరుగుతూ.. వరంగల్, హైద్రాబాద్, చేవెళ్ల ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపి నిరంకుశ పాలనలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు వైస్ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు వెంకట్రావు గౌడ్, కనకయ్య, బాజీ, తరుణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, బీరం సుధాకర్‌రెడ్డి, కటుకూరి శ్రీనివాస్‌రావు, రామకృష్ణ, మధుసూదన్, కృష్ణ, మహబూబ్ పాషా, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డీఈగా బాధ్యతలు స్వీకరణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట పంచాయతీరాజ్ సబ్ డివిజనల్ అధికారిగా రామం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన స్థానిక పీఆర్ కార్యాలయంలో విధుల్లో చేరి, అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తిను కలిశారు. దాంతో ఆయనను ఎంపీపీ చేతుల మీదుగా సన్మానించి, జ్ఞానికను అందించారు. పీఆర్ ఏఈ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సిద్ధాంతపు శ్యాం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులోని ఆల్ పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 11న ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బీజేపీలో చేరిక

అశ్వాపురం: ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కల్లూరి రామారావు శనివారం తిరిగి బీజేపీలో చేరారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఐకార్ మెంబర్ ముస్కు శ్రీనివాసరెడ్డి సమక్షంలో రామారావు బీజేపీలో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య, మండల కార్యదర్శి కోలా భాస్కర్, సోషల్ మీడియా కన్వీనర్ ఉమ్మా సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు

చండ్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణాలకు నిధుల కోసం ప్రతిపాదనలను బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూపతి శ్రీనివాసరావు శనివారం తాటి సుబ్బన్నగూడెంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు అందించారు. ఎమ్మెల్యే మెచ్చా ఆదేశాల మేరకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. సదరు ప్రతిపాదనలను ఎమ్మెల్యేకు అందించామన్నారు. గ్రామశివారులోని బ్రిడ్జి నుంచి నల్లకుంట వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలతోపాటు విద్యుత్ స్తంభాలు, పైపులు, ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ కోసం రూ3.70 కోట్లు నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 46 మందికి సాధారణ చిరు వ్యాధులు ఉన్నవారికి వైద్యం చేసి మందులు అందించారు. జ్వరము ఉన్న నలుగురికి రక్త పరీక్ష చేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న రాపిడ్ ఫీవర్ సర్వే ప్రోగ్రామ్‌ను తనిఖీ చేశారు. ఇంటి లోపల, బయట ఉన్న నీటి నిల్వలను తొలగించారు. పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సాగర్, హెల్త్ అసిస్టెంట్ నర్సింహారావు,ఆషా వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. లయన్స్ ఐ హాస్పటల్, వైరా సహకారంతో స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి ప్రారంభించగా.. 110 మందిని పరీక్షించి, వైద్య చికిత్సలు అందించారు. 20 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ రీజియన్ చైర్‌పర్సన్ కొఠారి చలపతిరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు రాయల కేథారేశ్వరరావు, డిస్ట్రిక్ క్యాబినెట్ సెక్రటరీ సత్తులూరి సత్యనారాయణ, డిస్ట్రిక్ జీఎంటీ, రీజియన్ కో–ఆర్డినేటర్లు శ్యాంబాబు, ఆరుద్ర సత్యనారాయణ, మండల సెక్రటరీ రేపాక ప్రసాదరావు, ట్రెజరర్ రంజాన్, సభ్యులు అనంతుల మహేశ్, చిట్లూరి రంజిత్‌కుమార్, డాక్టర్ కేపీ.సత్యనారాయణ, చల్లగురుగుల గోపి, బండి కొమరయ్య, కొమ్ము నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ములకలపల్లి: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

రాజీ మార్గమే రాజమార్గం

మణుగూరురూరల్: రాజీ మార్గమే రాజమార్గం అని మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మణుగూరు కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్, లీగల్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి పౌరుడూ భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంతాలకు, పట్టింపులకు పోకుండా కేసులను రాజీ చేసుకుని పరిష్కరించుకోవాలని, తద్వారా ప్రశాంత జీవనం గడపాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం మణుగూరు, అశ్వాపురం, ఏడూళ్లబయ్యారం, కరకగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలోని 1,115 కేసులను పరిష్కరించారు. అనంతరం లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు మణుగూరు మేముసైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ వారు పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ ఎస్వీ.రాఘవేంద్రరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, ఏడూళ్ళబయ్యారం సీఐ శివప్రసాద్, ఎస్సైలు నాగుల్‌మీరాఖాన్, శ్రీనివాస్, రాజేష్ యాదవ్, కోర్ట్ సిబ్బంది, కోర్ట్ కానిస్టేబుళ్లు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మణుగూరు మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యేకు వినతులు

దమ్మపేట: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియను ఏజెన్సీ, మైదాన ప్రాంతాల వారికి వేర్వేరుగా నిర్వహించాలని కోరుతూ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తాటిసుబ్బన్నగూడెంలో ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏటీఏ సభ్యులు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు కొట్టేసిన జీఓ నంబరు 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ నియామకాల్లో 100 శాతం స్థానిక గిరిజనులకే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర కార్యదర్శి కొమరం క్రుష్ణ, జిల్లా కార్యదర్శులు తొలెం వెంకటేశ్వర్లు, కారం రాందాసు, సనప రజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ డీఈ..

నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ రాజ్ డీఈ రామం ఎమ్మెల్యేను తాటిసుబ్బన్నగూడెంలో మర్యాదపూర్వకంగా కలసి పూల కుండీను అందజేశారు. కార్యక్రమంలో డీఈతో పాటుగా దమ్మపేట పంచాయితీ రాజ్ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని పామాయిల్ ఫ్యాక్టరీల్లో ఆదివారం నిర్వహించనున్న పలు ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామక్రుష్ణారెడ్డి, ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. చైర్మన్‌తో పాటుగా ఆయిల్‌ఫెడ్ మేనేజర్ ఆకుల బాలక్రుష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఐటీసీ, రోటరీ క్లబ్ ప్రతినిధులు

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్‌భద్రా ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను, మెరిట్ సర్టిఫికెట్లను అందించారు. ఐటీసీ కళాభారతిలో శనివారం జరిగిన కార్యక్రమంలో 15 మంది మెరిట్ విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జయంత్‌కుమార్ దాస్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులకు ప్రోత్సహించేందుకే ప్రతి ఏటా నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కేవీఎస్ గోవిందరావు, యేగి చంద్రశేఖర్, శివరాం కృష్ణన్, నాగమల్లేశ్వరరావు, ఆశిష్, చాంద్‌బాషా, విజయ్‌కుమార్, రంజిత్, సాయిరామ్, డీవీఎం నాయుడు, బసప్ప రమేష్, గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన రోశిరెడ్డి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను మార్యదపూర్వకంగా కలిశారు. భద్రాద్రి రామయ్య దర్శనానికి రావాల్సిందిగా ఆయన కోరారు. రాష్ట్ర విభజనకు ముందు రంగనాథ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించిన సమయంలో అసాంఘిక కార్యకలాపాలపై రంగనాథ్ తీసుకున్న చర్యలను గుర్తు చేసుకున్నారు. రోశిరెడ్డి వెంట నిరంజన్ రెడ్డి ఉన్నారు.


సీపీ రంగనాథ్‌తో రోశిరెడ్డి

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి

మణుగూరురూరల్: మండలంలోని పోలీస్ కాలనీకి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ఏపూరి మురళి శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొలోజు అయోధ్య, మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్‌లు వారి గృహానికి వెళ్లి మురళి భౌతికాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పారు. పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎస్‌కె.సర్వర్, అక్కి నరసింహారావు, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోందె కుటుంబరావు, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, ఎం.సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి


మణుగూరురూరల్: విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు

మణుగూరురూరల్: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కాళోజీ నారాయణరావు జయంతి, ప్రపంచ తెలుగుభాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత బీటీపీఎస్ సీఈ బిచ్చన్న కాళోజి నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి, జీవితాంతం పేదవాడి పక్షాన నిలిచిన ప్రజాకవి కాళోజీ అని కొనియాడారు. కార్యక్రమంలో బీటీపీఎస్, బీహెచ్ఇఎల్ అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని సాంబాయిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు, తెలుగు భాషదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీ సర్పంచ్ కాయం తిరుపతమ్మ హాజరై కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. పేద ప్రజలకు కాళోజీ నారాయణ రావు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గత విద్యాసంవత్సరం వార్షిక పరీక్షల్లో తెలుగు సబ్జెక్టులో 100శాతం ఉత్తీర్ణత, 10జీపీఏ సాధించిన పది విద్యార్థులు బి.విష్ణు చరణ్, సౌస్మిత, ఐశ్వర్య, భావన, దీపికలకు తెలుగు ఉపాధ్యాయులు వారి సొంత ఖర్చులతో బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు. వార్డ్ సభ్యులు పులిగిల్ల రమేష్, భవాని, ఉపాధ్యాయులు మాలోత్ భద్రు, విద్యార్థులు పాల్గొన్నారు.


భద్రాచలంటౌన్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న 'లిటిల్ ఫ్లవర్స్' యాజమాన్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో తెలుగు భాష దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి వరప్రసాద్, రమేష్‌బాబులు కాళోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.